క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్దశి


లక్ష్మీగణపతి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక పార్కురోడ్డులో వెలసిన శ్రీలక్ష్మీగణపతి దేవస్థానంలో గురువారం సంకటహర చతుర్థి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, సహస్ర జలాభిషేకం అనంతరం పట్టువస్త్రాలు, గరికతో ప్రత్యేకంగా అలంకరించి మహామంగళ హారతులు ఇచ్చి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు ప్రతాప్‌శర్మ, సుమశ్రీ రవి, పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్‌గా వెంకటరామిరెడ్డి



ఆళ్లగడ్డ : స్థానిక పురపాలక సంఘం కమిషనర్‌గా వెంకటరామిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్‌బాబును కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేయగా, ఆయన స్థానంలో ముమ్మిడివరంలో విధులు నిర్వహిస్తున్న వెంకటరామిరెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు. త్వరలో వెంకటరామిరెడ్డి బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది.

గర్భిణులకు సీమంతం


గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గురువారం శ్రీపరంజ్యోతి మానవ సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. నిర్వాహకులు దీక్షిత దాసాజీ మాట్లాడుతూ 108 మంది గర్భిణులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, గంధం, అక్షింతలు, చీరలు, గాజులు, పూలు, పండ్లు అందజేసి సీమంతం జరిపించారు. అలాగే గర్భిణులు సుఖ ప్రసవం కోసం ప్రత్యేక ఆహారపు అలవాట్లు, నియమాలు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షురాలు వసుధారాణి, కొశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా రాఘవేంద్రస్వామి ఆరాధన


రాఘవేంద్రస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైటిపేటలో వెలసిన కోదండరామాంజనేయ స్వామి దేవస్థానంలో రాఘవేంద్రస్వామి ఆలయంలో గురువారం రాఘవేంద్ర స్వామి ఆరాధన వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేదపండితులు విటల్ శర్మ, వరదాచార్యులు, సుధీంద్రాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి తెల్లవారుజాము నుంచే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ అనంతరం వివిధ రకాల పూలతో అలంకరించి పూలింగి సేవ జరిపించి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం పట్టణంలో స్వామి వారి ఉత్సమూర్తికి గ్రామోత్సవం చేపట్టారు.

వార్షికోత్సవ సభకు తరలిరండి

రుద్రవరం: అనంతపురం జిల్లా కేంద్రంలోని లలిత కళాపరిషత్‌లో ఈ నెల 25వ తేదీన నిర్వహించే ఏపీ దళిత సమాఖ్య 22వ వార్షికోత్సవ సభకు తరలి రావాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బుట్టి ఉశేని గుర్రప్ప, ప్రధాన కార్యదర్శి మల్లెపోగు నరసింహుడు పిలుపునిచ్చారు. స్థానిక అమ్మవారిశాల సెంటర్‌లో గురువారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. బుట్టి పెద్ద దస్తగిరి, చిన్న దస్తగిరి, మబ్బు ఓబులేసు ఉన్నారు.

గాలికుంటుకు టీకాలతోనే రక్ష


పాడిగేదెలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

దొర్నిపాడు: పాడిపశువులకు గాలికుంటు వ్యాధి నుంచి టీకాలే రక్ష ఇస్తాయని అని పశువైద్యాధికారి ధనుంజయుడు అన్నారు. గురువారం దొర్నిపాడులోని పాడిపశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి తాగునీరు, దాణా ద్వారా పశువులకు తేలికగా వ్యాపిస్తుందన్నారు. దీనివల్ల నోట్లో, గాలిగిట్టల్లో పుండ్లు ఏర్పడతాయన్నారు. పాల ఉత్పత్తిని తీవ్రంగా దెబ్బతీసి రైతులకు ఎక్కువ నష్టాలు కల్గించే వ్యాధుల్లో గాలికుంటు ప్రధానమైనదన్నారు. రైతులు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించుకోవాలని చెప్పారు.

గృహ నిర్మాణాలకు యాక్షన్ ప్లాన్


చాగలమర్రి ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి, హౌసింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ వెంకటసుబ్బయ్య

చాగలమర్రి: మండలంలోని జగనన్న లే అవుట్లు, సొంత స్థలాల్లో ప్రభుత్వ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించుకుంటున్న అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తి చేయటానికి వంద రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించామని జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా అధ్యక్షతన హౌసింగ్, ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల పని దినాలలో నిర్మించుకోవలసిన గృహాల లబ్ధిదారులకు మొత్తం 1.42 వేల పని దినాలు కల్పించవలసి ఉందన్నారు. కానీ ఇప్పటి వరకు 65వేల పని దినాలు మాత్రమే కల్పించామన్నారు. వారికి 50 రోజుల పనిదినాలకు రూ.1.73 కోట్లు మాత్రమే చెల్లించారన్నారు. ఇంకా 77 వేల పనిదినాలు కల్పించాల్సి ఉందని, వారికి పనులు జనరేట్ చేసి, 40 రోజుల వేతనాల మొత్తం రూ.2.31 కోట్లు వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఏపీఓ నిర్మలను ఆదేశించారు. బేస్‌మెంట్ వరకు నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న వారికి 50 రోజుల పనిదినాలను కల్పించాలని, రూఫ్ లెవల్, రూఫ్ క్యాస్ట్ వరకు పూర్తి చేసిన వారికి 40 రోజుల పని దినాలను చూపాలని సూచించారు. డీఈ నాగరాజు, ఏఈ షఫీవుల్లా, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల మంజూరు

శిరివెళ్ల: మండలంలోని గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరయ్యాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. 2023–24కు సంబంధించి 15 ఆర్థిక సంఘం 2వ విడత నిధులు మంజూరయ్యాయన్నారు. శిరివెళ్ల మేజర్ గ్రామ పంచాయతీకి రూ. 21.78 లక్షలు, యర్రగుంట్లకు రూ. 8.34 లక్షలు, గోవిందపల్లెకు రూ.3.89 లక్షలు, బోయలకుంట్లకు రూ.3.80 లక్షలు, చెన్నూరు రూ.3.53 లక్షలు, గంగవరం రూ.2.28 లక్షలు, గుంప్రమాన్‌దిన్నె రూ.3.89 లక్షలు, గుండంపాడు రూ.2.19 లక్షలు, జీనేపల్లె రూ.1.62 లక్షలు, కామినేనిపల్లెకు రూ.1.83 లక్షలు, కోటపాడు రూ.2.85 లక్షలు మంజూరయ్యాయి. మహదేవపురం రూ.3.31 లక్షలు, మోత్కలపల్లెకు రూ.1.40 లక్షలు, వనికినిదిన్నెకు రూ.1.31 లక్షలు, వీరారెడ్డి పల్లె రూ.1.37 లక్షలు, వెంకటాపురం గ్రామ పంచాయతీకి రూ.1.65 లక్షలు విడుదలయ్యాయన్నారు. కాగా మండల పరిషత్‌కు కూడా నిధులు మంజూరయ్యాయని చెప్పారు. బేసిక్ గ్రాంట్ కింద రూ.9.82 లక్షలు, టైడ్ గ్రాంట్ కింద రూ.14.87 లక్షలు విడుదలయ్యాయని వివరించారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

దొర్నిపాడు: మండలంలోని 11 గ్రామ పంచాయతీలకు 2023–2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండవ విడత 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయని ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం తెలిపారు. అమ్మిరెడ్డినగరం గ్రామానికి రూ.1,06,333, అర్జునాపురం రూ.93,430, బుర్రారెడిపల్లె రూ.1,99,686, చాకరాజువేముల రూ.5,66,333, దొర్నిపాడు రూ.733,924, గుండుపాపల రూ.2,74,410, కొండాపురం రూ.1,56,543, క్రిష్టిపాడు రూ.2,51,792, రామచంద్రాపురం రూ. 1,73,020, డబ్ల్యూ గోవిందిన్నె రూ.3,55,878, డబ్ల్యూ కొత్తపల్లె రూ.3,23,649 నిధులు మంజూరయ్యాయని చెప్పారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం


ఉయ్యాలవాడ మండపరిషత్ కార్యాలయ ఆవరణలో కొబ్బరి మొక్క నాటుతున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. అమ్మ పేరుపై ఓ మొక్క నాటుదాం అనే కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ముస్లిం శ్మశానం, మండల పరిషత్ కార్యలయంలో కొబ్బరి మొక్కలు నాటారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించినప్పుడే పర్యావరణం మెరుగుపడి వాతావరణంలో సమతుల్యత ఏర్పడుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని పాఠశాలలు, రహదారుల ఇరువైపులా కానుగ, చింత, వేప, వివిధ రకాల మొక్కలు ఉపాధి హామీ పథకం కింద నాటించినట్లు ఆ శాఖ ఏపీఓ రవిప్రకాశ్ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో జియారత్


కోటకొండలో ప్రత్యేక అలంకరణలో పీర్లు

రుద్రవరం: మండలంలోని కోటకొండలో మౌలాలి, దస్తగిరి స్వామి ,తువ్వపల్లెలో పెద్దకాశీం,చిన్నకాశీం పీర్ల జియారత్‌ను గురువారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం ముగిసిన 40 రోజులకు జియారత్ నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లోని చావిళ్ల నిర్వాహకులు పీర్లను దట్టీలు,పూల సూచికాలు, గొడుగులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. కొందరు మేళ తాళాలతో పూల సూచికాలు తీసుకెళ్లి పీర్లకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు చావిళ్ల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి

ఆత్మకూరు: చట్టాల గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి, ఆర్డీఓ ఏఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ జి.మోహన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆత్మకూరు మండలంలోని నాగలూటి గూండెం, ఇందిరేశ్వరం చెంచుగూండెలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాలు, కుగ్రామాలు, కొండ ప్రాంతాలు, రహదారి కనెక్టివిటీ లేని గ్రామాల్లో ప్రత్యేక న్యాయవిజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేలా ఆదేశాలు ఉన్నాయన్నారు. మహిళా చట్టాలు, లీగల్ సర్వీసెస్ యాక్ట్–1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందేందుకు మీరంతా అర్హులని చెప్పారు. మీ హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం వైద్యుల సహకారంతో శిబిరం నిర్వహించి, మలేరియా, డెంగ్యూ, రక్త హీనత, షుగర్, అనీమియా, తదితర పరీక్షలు నిర్వహించి మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారి పవన్‌కుమార్, డీటీ హరికృష్ణ, ఎఫ్‌ఆర్వో డి.కృష్ణప్రసాద్, ఐటీడీఏ ఏపీఓ నాగార్జున, న్యాయవాది జి.మాణిక్యరావు, సామాజిక కార్యకర్తల జుల్ఫీకర్‌ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సువర్చల, ఎస్‌ఐ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళాలు


విరాళం అందించిన దాత పి.శేషగిరిరావును సత్కరిస్తున్న ఆలయ పర్యవేక్షకురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి గురువారం ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన పి.శేషగిరి రావు రూ.1,01,116, అలాగే గుంతకల్‌కు చెందిన బి.పునీత్‌కుమార్ రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు వేర్వేరు సమయాల్లో అందజేశారు. విరాళాలు అందించిన దాతలకు దేవస్థానం తరఫున స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.



మేఘమై నేను వచ్చాను!

దొర్నిపాడు మండలంలోని క్రిష్టిపాడు వద్ద కుందూనది ఉరకలేస్తూ ప్రవహిస్తోంది. నదిలో కనుచూపు మేర జలమే కనిపిస్తుంది. ఇదిలా ఉండగా.. ఓ మేఘం కుందూ నదిలోకి తొంగి చూస్తున్నట్లు దృశ్యం ఆవిష్కృతమైంది. గురువారం సాయంత్రం ఒక్కసారిగా కారుమబ్బులు కమ్ముకోవడంతో కుందూనది ప్రాంతమంతా చీకటి అలుముకుంది. ఈ సమయంలో నల్లటి మేఘాలు నదిపై ఆవరించాయి. ఈ దృశ్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

– దొర్నిపాడు

రక్తదానం

నంద్యాల(వ్యవసాయం): చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్జీఓ కాలనీ నారాయణ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్మన్ దస్తగిరి, మారుతికుమార్ పాల్గొన్నారు. శిబిరంలో 30 మందికి పైగా రక్తదానం చేశారు. మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, రమేష్‌రావు, బాలుడు, యాకూబ్, శ్రీనివాస్, హుసేన్ పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

చాగలమర్రి: స్థానిక మల్లెవేముల సెంటర్ వద్ద చాగలమర్రికి చెందిన నూరుల్లా నుంచి గురువారం సుమారు వంద మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. చాగలమర్రిలోని వివిధ మద్యం దుకాణాల్లో కొనుగోలు చేసిన మద్యం సీసాలను అక్రమంగా విక్రయించేందుకు తీసుకెళ్తున్నాడే సమాచారం మేరకు నూరుల్లాను అదుపులోకి తీసుకొని మద్యం సీసాలను స్వాధీనం చేసుకొన్నట్లు చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లెకు చెందిన విశ్వనాథ్ అనే వ్యక్తి గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి పడిపోయాడు. బయటకు వెళ్లిన కుటుంబ సభ్యులు తిరిగొచ్చే సరికి అపస్మారక స్థితిలో ఉన్న విశ్వనాథ్‌ను వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

నేరాలపై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో సైబర్ క్రైం, హ్యూమన్ ట్రాఫికింగ్, ఉమెన్ సేఫ్టీపై విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సైబర్ సెక్యూరిటీ విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ కుమారి హాజరై ఆయా అంశాలపై వివరించారు. ప్రిన్సిపాల్ సుబ్బయ్య, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఇన్‌చార్జి రమణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

28న ఇంటర్వ్యూలు

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 28వ తేదీన హెట్రోల్యాబ్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం చేయుటకు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా స్కిల్ డెవెలప్‌మెంట్ అధికారి ప్రతాప్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్ చదివిన ఐటీఐ విద్యార్థులు, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ : 9440224291 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దత్తాత్రేయ స్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి విశేష పూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయ స్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

రేపటి నుంచి ప్రవచనాలు

శ్రీశైలంటెంపుల్: ధార్మిక కార్యక్రమాలలో భాగంగా శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నుంచి ప్రఖ్యాత ప్రవచనకర్త బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ వారిచే గణేశగాథలు అనే అంశంపై ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదికపై తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజు సాయంత్రం 7 గంటల నుంచి 8.30 గంటల వరకు ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నారు. పురాణాలలోని గణపతి ఆవిర్భావ గాథలు, గణపతి తత్త్వం, గణపతి స్వరూపంలోని అంతరార్థాలు, గణపతి మహిమావిశేషాలు మొదలైన అంశాలు, అలాగే ప్రవచనంలో సందర్భానుసారంగా శ్రీశైల క్షేత్ర మహిమ విశేషాలను వివరిస్తారు. భక్తులందరు ఈ కార్యక్రమానికి విచ్చేసి ప్రవచనాలను విని తరించాలని దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు పేర్కొన్నారు.

26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

నందికొట్కూరు: ఈ నెల 26వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు భక్తులు సహాయ సహకారాలు అందించాలని త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కోరారు. గురువారం టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి కృష్ణాష్టమి వేడుకల ఆహ్వాన పత్రం అందజేశారు. వేడుకలకు పోలీసు రక్షణ కల్పించాలని కోరారు. ఈ నెల 28వ తేదీన కృష్ణుడి ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

తక్కువ ధరకే మార్కెట్ గేట్ల వేలం

- పలుమార్లు వాయిదా పడటంతో ధర తగ్గించిన అధికారులు
- రూ.26.60 లక్షలతో 7నెలల నిర్వహణ


బహిరంగ వేలం నిర్వహిస్తున్న అధికారులు

నంద్యాల(సిటీ): పట్టణంలోని కూరగాయల మార్కెట్ గేట్ల నిర్వహణకు 2024–25వ ఆర్థిక సంవత్సరానికి మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. కాగా వేలాలు ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. కూరగాయల మార్కెట్ గేట్‌కు 7నెలల నిర్వహణ కోసం రూ.26.25 లక్షల ప్రారంభ ధరతో మొదలైన బహిరంగ వేలం రూ.26.60 లక్షలకు షేక్ మహమ్మద్ అర్షద్ హుసేన్ దక్కించుకున్నారు. గత ఆర్థిక సంవత్సరం రూ.61 లక్షలు కాగా నేడు మాత్రం రూ.45 లక్షల ప్రారంభ ధరను 7 నెలల కాలానికి లెక్కించి రూ.26.25 లక్షలుగా సర్కారువారి పాట నిర్ణయించామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. మార్కెట్‌లోని సైకిల్ స్టాండ్ పార్కింగ్ నిర్వహణ కోసం సరైన పోటీ లేక పోవడంతో వాయిదా వేశామని చెప్పారు.

నేడు ఉపాధి హామీ గ్రామ సభలు

నంద్యాల(అర్బన్): మండలంలోని గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. పంచాయతీల్లో 2024–25 సంవత్సరానికి సంబంధించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేపట్టే పనులపై చర్చించి తీర్మానాలు చేస్తారన్నారు. ఉదయం 9 గంటలకు చాబోలు, 10గంటలకు పోలూరు, పాండురంగాపురం, బిల్లలాపురం, బ్రాహ్మణపల్లె, పులిమద్ది, పుసులూరు, కొత్తపల్లె, 10.30 గంటలకు పెద్దకొట్టాల, రాయమాల్పురం, మిట్నాల, చాపిరేవుల, 11 గంటలకు కానాల, 12 గంటలకు గుంతనాల, సాయంత్రం 4 గంటలకు అయ్యలూరు, భీమవరం, మునగాల గ్రామాల్లో సభలు ఉంటాయని వివరించారు.

దొర్నిపాడు: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామ సభలను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం తెలిపారు. బుర్రారెడ్డిపల్లెలో తహసీల్దార్ సుభద్ర, చాకరాజువేముల, క్రిష్టిపాడులో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ సోమశేఖర్, దొర్నిపాడులో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, కొండాపురంలో ఎంఈఓ రామచంద్రయ్య, గుండుపాపలలో ఏఓ సునీత, రామచంద్రాపురంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ, అర్జునాపురంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, అమ్మిరెడ్డినగరంలో వెలుగు ఏపీఎం బాబు, డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె గ్రామాల్లో హౌసింగ్ ఏఈ బ్రహ్మయ్య పాల్గొంటారన్నారు. ఉపాధి పనుల ఎంపిక, మురుగు కాల్వలు, సీసీరోడ్లు నిర్మాణం, చెత్తసంపద కేంద్రాల నిర్వాహణ ఉంటుందన్నారు. సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

చాగలమర్రి: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ పి.తులసమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ, ఇన్‌చార్జ్ పంచాయితీ ఈఓ తాహిర్ హుసేన్ గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ కూలీల హక్కులు, అర్హతలపై అవగాహన కల్పించి, చేపట్టబోయే పనుల గురించి చర్చించి తీర్మాణం చేస్తామని చెప్పారు. పంచాయతీ పరిధిలోని 5 సచివాలయాలకు చెందిన సిబ్బంది, రైతులు, ఉపాధి హామీ కూలీలు హాజరు కావాలని కోరారు.

విశ్వనగర్ కాలనీ మురుగుమయం


గృహాల మధ్యలో మురుగు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని విశ్వనగర్ కాలనీలోని గాయత్రి దేవి ఆలయ సమీపంలో మురుగు నీరు ఇళ్ల మధ్యనే నిలిచిపోతుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. చిన్నపాటి వర్షానికే మురుగు కాల్వలోని మురుగు ఇళ్ల మధ్యన నిలిచిపోతుంది. రోజుల తరబడి మురుగు నిలిచిపోతుండటంతో దోమలకు ఆవాసంగా మారుతోంది. దీంతో దోమల బెడద తీవ్రమైందని స్థానికులు పేర్కొంటున్నారు. సమస్యపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని చెబుతున్నారు. ఇప్పటికే సీజనల్ వ్యాధులు వేధిస్తున్నాయని, సమస్యను పరిష్కరించకపోతు వ్యాధులు చుట్టుముట్టే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డ్రగ్స్‌ను నియంత్రించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ హుస్సేన్‌బాషా

శ్రీశైలంప్రాజెక్ట్: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత నిర్వీర్యం అవుతుందని సున్నిపెంట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదకద్రవ్యాల నియంత్రణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదక ద్రవ్యాలను గ్రామాల్లోకి రాకుండా అడ్డుకోవాలని విద్యార్థులకు సూచించారు. మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల యువత మత్తుకు బానిసలై దేశానికి పనికి రాకుండా పోతున్నారన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యంతో యువత పాల్గొని నియంత్రించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు డాక్టర్ ఎం.బుచ్చయ్య, ఎం.పద్మ, కె.రాజన్న, మహేశ్వర రెడ్డి, శివనాగిరెడ్డి, బాలు, పూర్ణేశ్వరరెడ్డి, కళ్యాణి, షాహిదా తదితరులు పాల్గొన్నారు.

నట్టేట ముంచిన మొక్కజొన్న విత్తనాలు

- రెండున్నర నెలలైనా కంకులురాని వైనం
- సమస్యను వివరించినా స్పందించని వ్యాపారి
- ఆందోళన చెందుతున్న రైతులు


మంచాలకట్టలో సాగు చేసిన మొక్కజొన్న పంట


మొక్కజొన్నలో విత్తనాలు లేని కంకులను చూపిస్తున్న బాధిత రైతు

గడివేముల: అన్నదాతను ఏదో ఒక రూపంలో కష్టాలు వెంటాడుతున్నాయి. ఆరుగాలం చమటోడ్చి పనిచేసినా నష్టపోతూనే ఉన్నారు రైతులు. ఈసారి నకిలీ విత్తనాలు నట్టేట ముంచాయి. వర్షాభావ పరిస్థితులు వెంటాడుతుండగా నకిలీ విత్తనాలు నట్టేట ముంచుతున్నాయి. విత్తన విక్రయదారుల నిర్వాకంతో అప్పులపాలవుతున్నారు. ఈయేడు నకిలీ మొక్కజొన్న విత్తనాలతో గడివేముల మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామ రైతులు నష్టపోయారు. గతేడాది మొక్కజొన్న సాగులో రైతులు లాభాలు గడించారు. మండలంలో ఏడువేల హెక్టార్లకుపైగా మొక్కజొన్న సాగు చేయగా మంచి దిగుబడులు లభించాయి. ఎకరాకు 35 క్వింటాళ్లకుపైగా దిగుబడులురాగా గిట్టుబాటు ధర సైతం రూ. రెండువేలు పలికడంతో రైతులు లాభపడ్డారు. దీంతో ఈయేడు సైతం మొక్కజొన్నసాగుకు మొగ్గు చూపారు. మండలవ్యాప్తంగా ఖరీఫ్ లో 22 వేల ఎకరాల్లో సోయాబీన్, పత్తి, మినుము, మిరప తదితర పంటలు సాగుచేయగా అందులో మొక్కజొన్న 8 వేల ఎకరాల్లో సాగు అయినట్లు అంచనా. అయితే మంచాలకట్ట గ్రామానికి చెందిన రైతులు ఓ కంపెనీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోయారు.

కంకుల్లో విత్తనాలు రాని పరిస్థితి....

మండలంలోని మంచాలకట్ట గ్రామానికి చెందిన రైతులు నందికొట్కూరులోని ఓ దుకాణంలో మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేశారు. కొత్తరకం విత్తనాలు అయినా వ్యాపారిపై నమ్మకంతో మొక్కజొన్న విత్తనాలు తీసుకున్నారు. ఈ మేరకు బిల్లులు కూడా తీసుకున్నారు రైతులు. అయితే మొక్కలు సరిగ్గా పెరగలేదు. రెండున్నర నెలలు దాటినా కంకుల్లో పూర్తిగా విత్తనాలురాని పరిస్థితి. దీంతో అయోమయానికి గురైన రైతులు సమస్యను విత్తన వ్యాపారికి వివరించారు. తమకు పంటలను సాగు చేయడానికి రాదని వ్యాపారి బుకాయిస్తున్నాడని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విత్తనం ఖర్చు, సేద్యం, రసాయన ఎరువులు, నీళ్ల మందుల కోసం ఎకరానికి రూ. 30 వేలు పెట్టుబడి పెట్టినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఆ వ్యాపారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న భరతనాట్యం


భరతనాట్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్య కళావేదికపై కర్నూలుకు చెందిన పి.గీతారెడ్డి, బృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చింది. కార్యక్రమంలో సిద్ధి వినాయక, ఓం నమఃశివాయ, గరుడ గమన, శివతాండవం, కాలభైరవాష్టకం తదితర గీతాలకు కీర్తన, అంకిత, దీక్షిత, వర్షిణి, పద్మ, ఇందు, ఆరాధ్య, యామిని, శ్రీజ, మేఘన తదితరులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.